# సింగిల్ పేజీ కథలు

## ఒకటే న్యాయం

రవి లంచ్ ముగించుకొని ఆఫీసులో తన సీటులోనికి వచ్చి కూర్చున్నాడో లేదో తిరుపతి నుండి బావమరది శేఖర్ ఫోను.

"ఎందుకో తెలియదు బావా! పదిరోజులు వుంటుందనుకున్న హేమ వున్నట్టుండి మీ యింటికి బయలుదేరేసింది. పండుగకని కొన్న కొత్తచీర కూడా తీసుకోకుండా వెళ్ళిపోయింది. నాన్న, అమ్మ పోయాక మీరుగానీ హేమ గానీ ఒక్క ఏడు కూడా దీపావళికి మా యింటికి రాలేదు. మూడేళ్ళ తరువాత యిప్పుడు తనైనా వచ్చిందని సంతోషపడ్డాను. కానీ ఆ సంతోషమూ నిలువలేదు. వదినా, ఆడబడుచూ ఏదైనా గొడవ పడ్డారా అంటే అదీ లేదు. వనజను అడిగాను. అలాంటిదేమీ లేదు అంది. హేమ మనస్సులో ఏముందో తెలియడం లేదు. నువ్వయినా కాస్త కనుక్కో, మా వలన ఏదైనా పొరబాటు జరిగివుంటే తప్పకుండా దిద్దుకుంటాం. ఇంటి ఆడబడుచు అలా అలిగి వెళ్ళిపోవడం మాకూ మంచిది కాదు కదా! కాకుంటే ఒకటే సందేహం. హేమకోసం ఒక పట్టుచీర కొనుక్కొచ్చింది వనజ. తనకూ కొనుక్కోవాలనుకొంది గానీ మాకు యీ యిల్లు కట్టాక పైకానికి కొంచెం కటకటగా వుంది. అనుకోకుండా యిన్స్టాల్మెంట్స్‌లో కట్టే విధంగా ఒక చీరలతను వచ్చాడు. అతని దగ్గర తనకోసం ఒక చీర కొనుక్కుంది. చిక్కు ఎక్కడ వచ్చిందంటే హేమకు కొన్న చీరకన్నా ఈ చీర ధర వెయ్యి రూపాయలు ఎక్కువ. ఈ తేడా హేమను బాధ పెట్టిందనుకుంటాను. పోనీ యీ చీరే తీసుకోమందామంటే చీర రంగు తనకు నచ్చలేదని చెప్పేసింది హేమ. అలా చెప్పేశాకే ధర విషయం తెలిసింది. హేమ చిన్నతనం నుండీ అంతే. నాకూ, తనకూ మా నాన్నగారు ఏం తెచ్చినా, నాకోసం తెచ్చింది ధర ఎక్కువంటే అలిగి కూర్చునేది. ఇంకా తన తత్వం మారలేదు. బావా! ఏమీ అనుకోకు నీ భార్యను గురించి యిలా చెబుతున్నానని. నా చెల్లెలు విషయం నాకు బాగా తెలుసుకాబట్టి చెప్పాను" ఫోన్ పెట్టేశాడు శేఖర్.

బావమరది శేఖర్‌గానీ అతని భార్య వనజగానీ చాలా మంచివాళ్ళు. వాళ్ళ ఆర్థిక పరిస్థితి అంత గొప్పగా లేకున్నా యిద్దరూ వుద్యోగాలు చేస్తూ పొదుపుగా వుంటూ యిన్నాళ్ళకు తమకంటూ ఒక యిల్లు కట్టుకున్నారు. గృహప్రవేశానికి తాము వెళ్ళలేకపోయారు. ఆ తరువాత ఆరు నెలలకు వున్నట్లుండి హేమకు అన్నగారు గుర్తుకొచ్చాడులాగుంది. తిరుపతికి వెళ్ళివస్తానంది. పండుగ దాకా వుండి రమ్మని పంపించాడు తను. చీటికీ మాటికీ అలగడం తన దగ్గరే అలవాటు అనుకుంటే చివరికి పుట్టింట్లోనూ అలాగే చేసింది. తలచుకుంటే బాధ వేసింది రవికి. సాయంత్రం యింటికి వెళ్ళగానే ఎదురైయింది హేమ.

"హాయ్! హేమూ! వెంకటాద్రికి వచ్చావా! నువ్వొస్తావని నాకేం తెలుసు. ఆఫీసులో పనివుండి కాస్త తొందరగా బయలుదేరి వెళ్ళిపోయాను. ఎలా వున్నారు మీ అన్నా వదిన?" మామూలుగా అడిగాడు.

"బాగానే వున్నారు" ముక్తసరిగా బదులిచ్చి రవికి కాఫీ తేవడానికి లోనికి వెళ్ళింది హేమ.

కాఫీ కప్పు అందుకుంటూ, "అప్పుడే వచ్చేశావేం హేమా! పండుగదాకా వుంటావనుకున్నాను" అన్నాడు రవి.

"ఎందుకులెండి! ఎక్కడివాళ్ళు అక్కడ వుంటేనే మంచిది"

"అరె! ఏం జరిగింది? ఎందుకలా మాట్లాడుతున్నావు?"



"న్యాయం మీరే చెప్పండి. నేను ఆ యింటి ఆడపడుచును. ఆ యింటికి వెళ్ళి ఎంత కాలమయింది. వీళ్ళ పెట్టిపోతల కోసం వెళ్ళానా? ఏదో నావాళ్ళు అన్న అభిమానంతోటే కదా! బట్టలు తీస్తే యిద్దరికీ ఒకే రకం తీయాలి. లేదంటే ఎప్పుడో ఒకసారి పుట్టింటికి వచ్చే ఆడబడుచుకు కొంచెం ఎక్కువగానే ఖర్చుపెట్టవచ్చు. తను మంచి చీర కొనుక్కుని నాకు చౌకలో కొంది. అదేమిటంటే ఆ చీర ఇన్స్టాల్మెంట్స్‌లో చెల్లింపు పద్ధతిన కొన్నారుట. ఏం ఆ చీరల వాడి దగ్గర నాకు నప్పేరంగు చీర లేకపోయిందా! పండుగకు వుండకుండా వచ్చేయడం నాకూ బాధగానే వున్నా ఆవిడకు పాఠం నేర్పాలనే వచ్చేశాను" చెబుతూండగానే హేమమొహం ఎర్రబడింది.

"పోనియ్. ఈ పండగ మనిద్దరం కలిసి జరుపుకోవాలని భగవంతుని యిచ్ఛ. పద. బజారుకు వెళదాం. నీకు యిష్టం వచ్చిన బట్టలు కొనుక్కుందువుగానీ" అన్నాడు రవి.

ooo

సంక్రాంతి పండుగ దగ్గరయింది. అనుకోకుండా గుమ్మంలో అడుగుపెడుతున్న అక్కయ్య లక్ష్మిని చూసి ఆశ్చర్యపోయాడు రవి.

"అరె! అనుకోకుండా వచ్చావే! బావగారూ పిల్లలూ ఏరీ?" అడిగాడు.

"మీ బావగారు అనుకోకుండా వాళ్ళ ఆఫీసువాళ్ళతో కలిసి నార్త్‌యిండియా టూర్ వెళ్ళారు. నన్నూ రమ్మన్నారు గానీ నాకు యిష్టం లేక రానన్నాను. పిల్లలకు సెలవులే కాబట్టి వాళ్ళ అత్తవచ్చి తీసుకెళ్ళింది" అంది లక్ష్మి.

హేమ వచ్చి లక్ష్మిని పలుకరించి లోపలికి తీసుకెళ్ళింది.

రేపు భోగి అనగా ఆరోజు సాయంత్రం రవి ఆఫీసు నుండి వస్తూ కొత్తబట్టలు తీసుకువచ్చాడు.

"ఇంటికి వచ్చి నన్నూ తీసుకెళ్ళి వుండొచ్చుగా! మీరే తెచ్చేశారే!" అంటూ హేమ రవి చేతిలోని బట్టల ప్యాకెట్టు తీసుకుంది.

"అబ్బ! ఎంత బాగుందో యీ చీర డిజైను! కానీ రంగే" అంది ప్యాకెట్టు విప్పి చూశాక.

"ఆ చీర నీకు కాదులే. అది అక్కయ్య కోసం తెచ్చాను. నీ కోసం నీకు నచ్చిన లేత నీలం రంగు చీర తెచ్చాను చూడు" అన్నాడు రవి.

నీలం రంగు చీర చూసి "ఇదీ బాగానే వుంది" అని తృప్తిపడింది హేమ.

అంతలో ఆ రెండు చీరల మీద వున్న లేబిల్ చూసిన లక్ష్మి "అదేమిట్రా తమ్ముడూ! ఈ రెండు చీరలకూ ధరలో రెండు వేలు తేడా వుంది. ఒకే ధరలో తేలేకపోయావా? నాకు మాత్రం యెక్కువ ధరలో యెందుకూ! హేమా! ఈ చీర కావాలంటే నువ్వు తీసుకో. నాకు నీలం రంగు చీర యిచ్చెయ్" అంది.

హేమకు అప్పుడుగానీ తెలియలేదు తన చీరకన్నా లక్ష్మికి తెచ్చిన చీర ఖరీదైనదని. హేమ యేదో అనబోయేంతలో రవి అన్నాడు "కాదులే అక్కయ్యా! నువ్వు యెప్పుడో రెండేళ్ళకో మూడేళ్ళకో ఒకసారి వస్తావు. మాటి మాటికీ నీకోసం ఖర్చుపెట్టము కదా! హేమ యిక్కడ ఉండేదే! ఎప్పుడు కావాలన్నా యేం కొనాలన్నా తీసుకోవచ్చు. ఇంటి ఆడబడుచుకు యివ్వాల్సిన గౌరవం యిచ్చి తీరాలి అన్నది నా అభిప్రాయం కాదు సుమా! అక్షరాలా హేమ అభిప్రాయం అది. కావాలంటే అడిగి చూడు. తన అభిప్రాయా

నికి విలువ యివ్వకపోతే వాళ్ళ పుట్టింటిపైన అలిగినట్టు నాపైనా అలుగుతుంది! అవునా హేమా?" అన్నాడు.

లక్ష్మికి ఏమీ అర్థం కాలేదు కానీ హేమకు మాత్రం నోట మాట రాలేదు. అవునన్నట్టుగా తలవూపింది వెర్రిగా.

పండుగయిపోయిన మూడు రోజుల తరువాత ఒక రోజు రాత్రి హేమ రవితో అంది "ఏమండీ! నేను అలిగి వచ్చేశానని మా అన్నయ్య బాధపడుతూ వుంటాడు. రేపు ఓసారి వెళ్ళి నాలుగు రోజులుండి వస్తాను"

"దట్సగుడ్" అన్నాడు రవి భార్యవైపు తృప్తిగా చూసి.

-కె.యస్.ఇందిరా ప్రియదర్శిని (చెన్నై)

# ఇది తప్పంటారా?

"అబ్బబ్బ..ఏం పిసినారిరా బాబూ ఈ చంద్రం గాడు. ఇలాంటి వ్యక్తిని నా ఇరవై ఏళ్ళ సర్వీసులో యింతవరకు చూడలేదు. మనం యిలా రోజు టీలు సిగరెట్లు అవి ఒకళ్ళకొకళ్ళం తెప్పించుకొని ఏ ప్రమోషనొచ్చినా, ఏ చిన్న అకేషన్కయినా పార్టీలిచ్చుకొని ఎంజాయ్ చేస్తామా..మహానుభావుడు ఏ రోజూ ఒక్క టీ చుక్కయినా ఒకళ్ళకిప్పించినట్టూ లేదు. తాను తాగినట్టు లేదు. పైగా వేసుకొనే ఆ డ్రస్‌లు చూడు. డబ్బులు దాచి దాచి ఏ ఫైవ్‌స్టార్ హోటల్ కొంటాడో ఏమో" ఒక విలన్ నవ్వు నవ్వాడు రామ్మూర్తి. అతనితో శృతి కలిపేరు భజనపరులు.

"మీకెందుకండి అతని గురించి అంత ఆసక్తి. అతనెలా వుంటే మీకేం..మిమ్మల్నేమయినా యిప్పించమన్నాడా" అప్పుడే ఆఫీసులో అడుగుపెట్టిన సూర్యనారాయణకి రామ్మూర్తి మాటలు కోపం తెప్పించాయి.

"అతన్నంటే నీకు పొడుచుకొచ్చిందేమిటోయ్ పౌరుషం" రామ్మూర్తి చుట్టూ చేరిన కాకారాయుళ్ళలో ఒకరి ఉవాచ.

"పోనీలేవోయ్ రాజూ..ఆ చంద్రం పొదుపుచేసి చేసి ఈ సూర్యానికేమైనా వడ్డీలకి అప్పులిస్తున్నాడో ఏమో అయినా అంత పొదుపరితో ఆ భార్యా, పిల్లలు ఎలా వేగుతున్నారో ఏమో. కడుపునిండా 'తిండయినా పెడుతున్నాడో లేదో. పాపం అయినా.." ఇంకేదో అనబోయి గుమ్మం వేపు చూసి ఠక్కున ఆగిపోయాడు రామ్మూర్తి. చేతిలో ఫైలు పట్టుకొని తలొంచుకొని తన సీటు వైపు వెళ్ళిపోయాడు చంద్రం.

అంతమంది రామ్మూర్తి చుట్టూ చేరి వున్నారంటే ఇంత వరకు ఏం చర్చించుకుంటున్నారో..తనను చూడగానే సడన్‌గా రామ్మూర్తి మాట ఆగిపోయిందంటే ఆ టాపిక్ ఏమిటో తేలిగ్గానే వూహించుకోగలడు చంద్రం.

చంద్రం వూరుకొన్నా సూర్యానికి మాత్రం బాధగా వుంటుంది. వాళ్ళని కడిగేద్దామన్నంత కోపం వస్తుంది. కానీ 'కందకు లేని దురద కత్తిపీట కెందుకన్నట్లు' వుంటుంది కదా. చంద్రమే వాళ్ళకొకమారు తన విషయమెందుకని గట్టిగా బుద్ధిచెప్పొచ్చుకదా. అయినా నిండా ముప్ఫయి ఏళ్ళయినా లేని చంద్రం ఏ సరదాలు లేకుండా ఎలా వుండగలుగుతున్నాడో తనకీ ఆశ్చర్యమే. ఒక సినిమా అనడు, ఒక షికారనడు. పోనీ జీతమేమయినా తక్కువొస్తుందా అనుకొంటే పదిహేనువేల పైమాటే.

"సార్ మేనేజరుగారు మిమ్మల్ని రమ్మంటున్నారు" ఎటెండరు పిలుపుతో ఆలోచనలకి బ్రేక్‌పడింది సూర్యానికి.


సాయంకాలం ఐదవుతోంది. చంద్రం ఫైల్సన్నీ మూసి రేక్‌లో సర్ది తాళం వేసి బయలుదేరుతున్నాడు.

"ఆగండి చంద్రంగారూ. ఇంటికి బయలుదేరుతున్నట్టు వున్నారు. నేను అటే వస్తున్నా కలిసే వెళదాం" సూర్యం మాటలకి వెళ్ళబోతున్న చంద్రం ఆగేడు. ఎవరి విషయంలోనూ కలగజేసుకోని సూర్యం అంటే గౌరవం చంద్రానికి.

ఇద్దరూ కలిసి బయలుదేరారు. "చంద్రంగారూ మిమ్మల్నొకటడుగుతాను ఏమీ అనుకోరుగా" అన్నాడు సూర్యం.

"అడగండి ఫరవాలేదు" నవ్వుతూ అన్నాడు చంద్రం.

"పదిహేను వేల దాకా జీతం తెచ్చుకొంటారు. మీరెందుకంత.." మధ్యలోనే ఆగిపోయాడు సూర్యం తానడగడం సమంజసమో కాదో అనుకొంటూ.


కథా నిలయం
శ్రీకాకుళం

"మీ భావం నాకర్థమయింది. అందరూ నా వెనక అనుకొనే మాటల్నే మీరు డైరక్టుగా నన్నడుగుతున్నందుకు చాలా ఆనందంగా వుంది. ఎలాగూ యిటే వస్తున్నారుగా. మా యిల్లు యిక్కడికి దగ్గరే. రండి! మీ సంశయం నివృత్తి చేస్తా"

ooo

ఇల్లు చిన్నదైనా చాలా నీటుగా వుంది. ఎక్కడి వస్తువులక్కడ తీర్చిదిద్దినట్టు వున్నాయి. చిన్నా పెద్ద జనాభా చాలా మందే కనిపిస్తున్నారు ఆ యింట్లో.

హాలుకి ప్రక్కనే వున్న చిన్న గదిలో మంచం మీద ఒక ఎనభై ఏళ్ళ ముసలాయన పడుకుని మూలుగుతున్నాడు. ఆ మంచం మీదే పక్కగా ఒక డెబ్బైయేళ్ళ ముసలావిడ కూర్చొని ముసలాయనకి విసురుతూ ఏదో లాలనగా అడుగుతోంది. వెళ్ళగానే లోపల సూర్యం కంటపడిన దృశ్యం అది.

"రండి సూర్యంగారూ. ఈయన మా నాన్నగారు. వయస్సు వచ్చినప్పటినుంచి ఐదేళ్ళక్రిందటి దాకా నా పిల్లలు నా సంసారం అంటూ బాధ్యతలు మోసి మోసి తన కంటూ ఏమీ మిగుల్చుకోకుండా పెద్ద చదువులు చదివించి నా కొడుకులిద్దరు పెద్ద ఆఫీసర్లంటూ మురిసిపోయిన నాన్నగారిని అతని ఖర్మానికతన్ని 'మిగిలిన బరువులు మీరే మొయ్యండి మాకేం సంబంధం లేదని' వదిలేసిన ఇద్దరన్నయ్యలు వేరే వూళ్ళల్లో దర్జాగా భార్యాపిల్లలతో బ్రతుకుతున్నారు. తీరని బాధ్యతలతో దిగుళ్ళతో వయస్సుడిగిపోయి నాలుగేళ్ళ బట్టి పక్షవాతంతో మంచం మీద పడి వున్నారు. పక్కనే కూర్చుని విసురుతున్నావిడ మా అమ్మగారు. ఆవిడకి డెబ్బై ఏళ్ళు. నాన్నగారి మంచి చెడ్డలన్నీ ఓపిక లేకపోయినా ఆవిడే చూసుకుంటూ వుంటుంది" కొడుకు మాటలు విని తలెత్తి చూసి "ఎవరు నాయినా" అంది మెల్లగా.

"మా ఆఫీసులో నాతోపాటు పనిచేసే ఆయన- సూర్యంగారు" అన్నాడు చంద్రం. అంతలోనే "అక్కా ఇలా రా ఒకమాట" అన్నాడు చంద్రం.

లోపలి నుంచి ముప్ఫయి రెండు అలా వుంటాయి ఒకావిడ వచ్చింది.

"ఈవిడ మా అక్క విశాల. పెళ్ళయి పదేళ్ళయి ఇద్దరాడపిల్లల తల్లయిన తరువాత కట్నం చాలలేదని యింకా వేధించే భర్త పైశాచిక కృత్యాలు భరించలేక పిల్లలతో సహా పుట్టిల్లు చేరింది. ఈమెను చదివించక చేసిన తప్పుకి పరిహారంగా చెల్లెలు వనజను కాలేజీలో చదివిస్తున్నా. తను బి.ఏ. చదువుతోంది. ఇప్పుడు చెప్పండి తండ్రి వైద్య ఖర్చులు, అక్క, ఇద్దరాడపిల్లల భవిష్యత్తు, నా చెల్లెలు చదువు, వీరందరి వివాహాలు యివన్నీ నా ఒక్కడి వల్లే జరగాలంటే మామూలుగా సాధ్యమేనా చెప్పండి. ఇరుగిళ్ళకి పొరుగిళ్ళకి అప్పులకెళ్ళకుండా తెచ్చిన జీతంతోటే కుటుంబసభ్యులందరూ తన వారే అనుకొని అందరి అవసరాలు గమనిస్తూ ఎవరికీ కష్టం కలగకుండా సంసారాన్ని గుట్టుగా నెట్టుకొస్తున్న నా యిల్లాలు రమదే ఈ క్రెడిట్ అంతా" అప్పుడే కాఫీలు తెస్తున్న రమని చూసి ఒక కప్పు అందుకొని సూర్యానికిస్తూ అన్నాడు చంద్రం.

"ఇప్పుడు చెప్పండి. నేను పిసినారిగా వుండటం తప్పా. ఇవన్నీ నేనందరితో చెప్పుకొని తిరగాలంటారా"

కళ్ళల్లో నీరు తిరుగుతూ వుండగా, చంద్రం విశిష్ట వ్యక్తిత్వాన్ని వీళ్ళెప్పుడు గుర్తిస్తారో అని రామ్మూర్తిలాంటి వాళ్ళని తలచుకుంటూ బయటకొచ్చాడు సూర్యం.

-వి.సత్యవతీదేవి (గుమ్మలక్ష్మీపురం)